క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ సిమెంట్ బల్లలు ధ్వంసం



ఆత్మకూరు(మంగళగిరి): నగర పరిధిలోని ఆత్మకూరులో వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాటు చేసిన సిమెంట్ బల్లలను కొందరు దుండగులు ధ్వంసం చేశారు. ప్రజలు చెట్ల కింద కూర్చునేందుకు ఏర్పాటు చేసిన బల్లలను ధ్వంసం చేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అభిమానులు ఎవరైనా ప్రజలకు అవసరమైన బల్లలను వీలైతే ఏర్పాటు చేయాలే తప్ప ఇలా ధ్వంసం చేయడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్మికులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి



తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని పాలకులు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు అన్నారు. కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్‌తో కలసి సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ కోర్టులు కార్మికులకు అనుకూలంగా ఇచ్చిన తీర్పును అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆదినారాయణ, నాగేశ్వరరావు, కార్మికులు రమణ, ఆశీర్వాదం, ఎం.గురవయ్య, ఇమాంబి, శారద, దుర్గా భవాని, రమాదేవి, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కత్తితో అర్ధరాత్రి యువకుడి హల్‌చల్

దుగ్గిరాల: మండల పరిధిలోని ఈమని గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు విషయంలో ఫొటో పెట్టనందున ఇరువర్గాలు మధ్య జరిగిన ఘర్షణ ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల ప్రకారం.. తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరు రెండు రోజుల కిందట గ్రామంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన తెలుగుదేశం నాయకుని ఫొటో లేదని ఏర్పాటు చేసిన వారిని ప్రశ్నించగా ఘర్షణ ఏర్పడింది. దాదాపు రెండు నుంచి మూడు గంటల పాటు మాటల యుద్ధం జరగగా.. అర్ధరాత్రి సమయంలో ఫొటో ఏర్పాటు చేయని వ్యక్తి కత్తి తీసుకువచ్చి రోడ్లపై హల్‌చల్ చేశారు. ఈ క్రమంలో ఓ యువకుడు గాయపడ్డాడు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించగా స్థానిక పార్టీ నాయకులు కలుగజేసుకుని ఇద్దరి మధ్య సఖ్యత కుదిర్చారు.

విద్యతోనే మానవ వికాసం



గుంటూరు ఎడ్యుకేషన్: మనిషిని అజ్ఞానం నుంచి విజ్ఞానం వైపు నడిపించే విద్య ప్రపంచ చరిత్ర గతిని మార్చి వేస్తోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి పేర్కొన్నారు. బాలానంద కేంద్ర ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్రాడీపేట, కృష్ణనగర్ లోటస్ ఆద్య పాఠశాలల వార్షికోత్సవాన్ని 'ఆధ్యాస్ కార్నివాల్' పేరుతో సోమవారం కృష్ణనగర్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకోవడంలో విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరచుకుని ఏకాగ్రత, కఠోరశ్రమతో సాధించుకోవాలని కోరారు. బాలానంద కేంద్ర పాలకమండలి అధ్యక్షుడు డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏడు దశాబ్దాల నుంచి బాలానంద కేంద్రాల ద్వారా వేలాది మందిని క్రమశిక్షణగల పౌరులుగా తీర్చిదిద్దినట్లు వివరించారు. విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ అంశాల్లో ప్రతిభను ప్రదర్శించిన విద్యార్థులకు అతిథులు ప్రశంసా పత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, కార్యదర్శి నడింపల్లి వెంకట గురుదత్, సహాయ కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు, కరస్పాండెంట్ పరుచూరి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ యడ్లపల్లి ఉమాదేవి, కేతరాజు రామ్ సుభాష్ పాల్గొన్నారు.

రోజువారీ వేతనంపై పారిశుధ్య కార్మికులు

నెహ్రూనగర్: నగరంలో రోజువారీ వేతనంపై పనిచేసేందుకు పారిశుధ్య కార్మికులు నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌లో నేరుగా లేదా 08632345103కి కాల్ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో మెరుగైన పారిశుధ్య పనులు చేపట్టడం ద్వారా నగరాన్ని స్వచ్ఛ గుంటూరుగా తీర్చి దిద్దుకోవాడానికి ప్రస్తుతం ఉన్న కార్మికులకు అదనంగా కార్మికులు అవసరమని చెప్పారు. రోజువారీ వేతనంపై కేటాయించిన ప్రాంతాల్లో కేటాయించిన పారిశుధ్య పనులు చేయడానికి ఆసక్తి ఉన్నవారు వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు.

రసాయనాల ఊబిలో అమృత ఫలాలు



మార్కెట్‌లో యథేచ్ఛగా కృత్రిమ విధానాల వినియోగం

కెమికల్స్ వాడకంతో విషతుల్యమవుతున్న పండ్లు

మంగళగిరి: అసలే వేసవి. మండుతున్న ఎండలకు ఏదైనా పండ్లరసం తాగాలన్నా.. వాటిని తినాలన్నా ఒక్క క్షణం ఆలోచించాల్సిన పరిస్థితి నెలకొంది. మార్కెట్‌లలో ఎంతో కనువిందుగా కనిపించే అమృత ఫలాలు ప్రస్తుత కాలంలో విషతుల్యంగా మారుతున్నాయి. మధురమైన రుచితో పాటు రసాయనాలను సైతం శరీరానికి చేరవేస్తున్నాయి. ఆకట్టుకునే రంగు కోసం పలువురు వ్యాపారులు కృత్రిమ విధానాలు పాటించడంతో దుష్పరిణామాలు తలెత్తుతున్నాయి. సహజ పద్ధతులలో పండ్లను మగ్గపెడితేనే సత్ఫలితాలు ఉంటాయి. ఈ క్రమంలో కొనుగోలుదారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కెమికల్స్ వాడని పండ్లనే భుజించాలని కోరుతున్నారు.

వేసవిలో మామిడిదే పైచేయి..

వేసవి ప్రారంభమైన వెంటనే మార్కెట్‌లోకి మామిడి పండ్లు వచ్చేస్తాయి. అరటి, పుచ్చకాయ, ద్రాక్ష, ఇలా ఎన్ని రకాల పండ్లు ఉన్నా మామిడి సాటి దేనికీ రాదు. రసాయన రంగులతో మాగబెట్టే పండ్లల్లో మామిడి కూడా ముందంజలోనే ఉంటుంది. ఇటువంటి వాటిని ఆరోగ్యం కోసం ఇష్టంగా కొనుగోలు చేసి తింటే ప్రమాదకర రసాయనాలు కూడా మన ఒంట్లోకి ప్రవేశిస్తున్నాయని వైద్యులు అంటున్నారు. వీటికి వినియోగించే ప్రమాదకర రసాయనాలు దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు దారి తీస్తాయని అంటున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్రంగా అనారోగ్యాల బారిన పడే అవకాశముందని.. ప్రధానంగా హృదయం, కాలేయం, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతాయని వైద్యులు చెబుతున్నారు.

తాజా వాటిని గుర్తించడం ఎలా..

సంప్రదాయ పద్ధతిలో పండిన ఫలాలు కమ్మని వాసన, తియ్యటి రుచితో ఉంటాయి. ఈ పండ్లపై నల్లటి మచ్చలు కనిపిస్తాయి. ఫలాలను తెంపిన చోట తాజాగా కాకుండా వాడిపోయినట్లు కనిపిస్తుంది. ఈ పండ్లపై కాసింత గడ్డి పొట్టు సన్నని బూజు కనిపిస్తాయి. సహజంగా మగ్గించిన పండ్లను గుర్తించాలంటే ఒక బకెట్‌లో నీరు నింపి అందులో పండ్లు వేయాలి. సక్రమంగా పండించిన ఫలాలు నీటి అడుగు భాగానికి చేరుకుంటాయి. ప్రమాదకర రసాయనాలతో మగ్గించినవి మాత్రం నీటిపైకి తేలుతుంటాయి. కాల్షియం, కార్బైడ్ నీళ్లలో పండ్లను ఉడకబెట్టి కృత్రిమంగా మగ్గించినవి ఆకారం కోల్పోయి గుండ్రంగా మారుతాయి. రసాయనాలతో పండించినవి తాజాగా నిగనిగలాడుతూ కనిపిస్తాయి. ఈ ఫలాలు వాటి సహజమైన రుచిని చాలా వరకు కోల్పోతాయి. రసాయనాల పండ్లపై ఆకుపచ్చ, బ్రౌన్ కలర్‌లో మచ్చలు వుంటాయి.



కెమికల్స్‌తో పండిస్తున్న అరటి గెలలు

అప్రమత్తంగా ఉండాలి..



రసాయన పండ్లను తింటే వాంతులు, నీరసం, చర్మ సమస్యలు, విపరీతమైన దాహం, నీటిలో పుండ్లు తదితర సమస్యలు వస్తాయి. చిన్న పిల్లలు, గర్భిణులకు ఇవి మరింత ప్రమాదకరం. ఇవి మానవ నాడీ వ్యవస్థను దెబ్బతీసి జ్ఞాపక శక్తిని కోల్పోయేలా చేస్తుంది. హృదయం, కాలేయం, కిడ్నీలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. తాజాగా పండించిన పండ్లను తీసుకోవాలి. వేసవికాలంలో అధికంగా పండ్లను తీసుకుంటారు. కాబట్టి కొనుగోలు విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

– డాక్టర్ పి.అనూష

చర్యలు తీసుకుంటాం..

పండ్లను రసాయనాలతో పండించడంతో ప్రజలు అనారోగ్యాల బారిన పడే ప్రమాదముంది. ఫిర్యాదులు వస్తే తనిఖీలు నిర్వహించి రసాయనాలు కలిపి పండ్లను విక్రయించే వ్యాపారులపై చర్యలు తీసుకుంటాం. నిరంతరం పండ్ల దుకాణాలను తనిఖీలు నిర్వహించి రసాయనాలు కలిపి విక్రయించే వ్యాపారులను ఉపేక్షించం.

– రవీంద్రరెడ్డి, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, మంగళగిరి

రాజధాని రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన

తాడేపల్లి రూరల్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ భారతదేశ పర్యటనను నిరసిస్తూ సోమవారం రాజధాని రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని ఉండవల్లి సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజధాని రైతు సంఘం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. అమెరికా ఉపాధ్యక్షులు జేడీ వాన్స్ వ్యవసాయ ఉత్పత్తులను నామమాత్రపు టాక్స్ చెల్లించేలా ఒప్పందం చేసుకోవడానికి భారత దేశానికి వచ్చారని అన్నారు. ఈ ఒప్పందం వల్ల భారతదేశంలోని రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షులు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ.. ఈ వ్యవసాయ ఒప్పందం చేసుకుంటే భారత దేశానికి అవమానకరం అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.బక్కిరెడ్డి, దాసరి సోమయ్య, డి.సాంబశివరావు, బి.పద్మారెడ్డి, రామారావు, రాఘవయ్య పాల్గొన్నారు.

ప్రాతూరులో..

తాడేపల్లి రూరల్ పరిధిలోని ప్రాతూరులో నిర్వహించిన గోబ్యాక్ జేడీ వాన్స్ కార్యక్రమానికి రూరల్ అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించగా రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్య వాదానికి కేంద్ర ప్రభుత్వం దాసోహం అయిందని అన్నారు. రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. బహుళ జాతి కంపెనీలతో నరేంద్ర మోడీ ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా ఉన్నాయని విమర్శించారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, మహిళా సంఘం జిల్లా నాయకురాలు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, రైతుసంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, దాసరి రమేష్, నాగపోగు విజయరాజు పాల్గొన్నారు.



ప్రాతూరులో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ఉచిత ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తాడేపల్లి రూరల్: విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రైవేటు పాఠశాలలో ఉచిత ప్రవేశాలకు అర్హులైన వారు ఏప్రిల్ 28 నుంచి మే 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తాడేపల్లి ఎంఈఓలు జి.శాంతకుమారి, డి.నాగేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదు సంవత్సరాలు నిండిన వారికి మాత్రమే 1వ తరగతిలో అడ్మిషన్లు ఇవ్వాలని, సీబీఎస్ఇ, ఐసీఎస్ఇ, ఐబీ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి 2025 మార్చి 31 నాటిని స్టేట్ సిలబస్ పాఠశాలలో ప్రవేశానికి, జూన్ 1 నాటికి ఐదేళ్లు నిండి ఉండాలన్నారు. మే 16 నుండి 20వ తేదీ వరకు గ్రామ, వార్డు సచివాలయాల వద్ద డేటాతో పోల్చుకుని అడ్మిషన్లు ఇస్తారని అన్నారు. విద్యాశాఖ వెబ్‌సైట్ http//:cre.ap.gov.inలో వివరాలు నమోదు చేసుకోవాలని కోరారు. ప్రతి ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న, బలహీన వర్గాల విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంటుదన్నారు. అడ్మిషన్లకు అవసరమయ్యే ధ్రువీకరణ పత్రాల కోసం తల్లిదండ్రుల ఆధార్, రేషన్ కార్డు, ఓటరు కార్డు, భూమి హక్కుల పత్రం, పాస్‌పోర్టు, విద్యుత్ బిల్లు, డ్రైవింగ్ లైసెన్స్, జనన ధ్రువీకరణ పత్రం దరఖాస్తుతో జతపర్చాలన్నారు. పూర్తి సమాచారం కోసం టోల్ ఫ్రీ నెంబర్ 18004257859ను సంప్రదించాలని సూచించారు.

నూతన ఆవిష్కరణపై అవగాహన సదస్సు

తాడేపల్లి రూరల్: వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీ కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నూతన ఆవిష్కరణపై అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏసీఐసీ సీఈఓ రమణ్‌కాంత్, యూనివర్సిటీ ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబుతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించి మాట్లాడారు. అంకుర సంస్థలు, నూతన ఆవిష్కరణ ఏర్పాటు చేయడంలో కావాల్సిన నైపుణ్యాలను ఎలా మెరుగుపరుచుకోవాలనే అంశంపై అవగాహన సదస్సును నిర్వహించామని తెలిపారు. నూతన ఆవిష్కరణలను ఏర్పాటు చేయడంలో నైపుణ్యాలను మెరుగు పరచుకోవడానికి ఉపయోగపడుతుందని ఆశాభావంవ్యక్తం చేశారు. నూతన ఆవిష్కరణలను ఏర్పాటు చేయడానికి ఏ విధమైన తోడ్పాటు కావాలి, ఎలా ప్రారంభించాలని అనే అంశాలను వివరించామని తెలిపారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కామర్స్ విభాగాధిపతి డాక్టర్ శాంతకుమారి, ఉప విభాగాధిపతి డాక్టర్ షాహిద్ షాకర్ అహ్మద్, ఆచార్యులు వెంకటేశ్వర కుమార్ తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న ఏసీఐసీ సీఈఓ డాక్టర్ రమణ్‌కాంత్

అంగన్‌వాడీలో పోషణ పక్వాడ్

దుగ్గిరాల: ఐసీడీఎస్ ద్వారా తీసుకునే పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమం మండలంలోని చిలువూరు–3 క్లష్టర్ పరిధిలో సోమవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భవానీ మాట్లాడుతూ.. 1000 రోజుల పోషణ పక్వాడ్‌లో భాగంగా గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సి.హెచ్.మాణిక్యం, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్‌లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పెనుమాక సెక్టార్ కృష్ణనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణ్ పక్వాడ్‌పై గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సూపర్‌వైజర్ పి.శిరోమణి తల్లులతో మాట్లాడారు. బాలింతలు మునగాకు చపాతి ఏ విధంగా తయారు చేసుకోవాలో చూపించారు. గర్భిణులు ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇస్తున్న బాలామృతం, పాలు, కోడిగుడ్లు, బీఎస్ కిట్స్, రైస్, పప్పు, ఆయిల్‌ను అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జి.సుజాత, బి.ప్రమీల తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లి రూరల్: అవగాహన కల్పిస్తున్న పి.శిరోమణి

నవులూరు(మంగళగిరి): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తప్పకుండా తీసుకుని ఆరోగ్య సూత్రాలు పాటించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వేణుకుమారి తెలిపారు. నగర పరిధిలోని నవులూరు అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార పక్షోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యం సరిగా చూసుకున్నప్పుడే ఆరోగ్యవంతమైన పిల్లల కలుగుతారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు బాలింతలు పాల్గొన్నారు.

బీసీల ఆత్మగౌరవంతో ఆటలాడొద్దు

కేశన శంకరరావు

మంగళగిరి టౌన్: ఓబీసీల సాధికారతకు దోహదపడే సమగ్ర కులగణన నిర్వహించేందుకు అధికారంలో లేనప్పుడు ఒక రీతిన.. అధికారం వచ్చిన తరువాత మరో రీతిన ద్వంద్వ ప్రమాణాలు పాటించడం సరికాదని ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు అన్నారు. బీసీల ఆత్మగౌరవంతో ఆటలాడవద్దని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళగిరి నగర పరిధిలోని బైపాస్‌రోడ్ వద్ద ఉన్న రాష్ట్ర కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. దేశ వ్యాప్తంగా సమగ్ర కుల గణన నిర్వహించే విషయంలో పార్టీల ద్వంద్వ నీతిని తప్పుపట్టారు. కర్నూలు జిల్లా నూతన అధ్యక్షులుగా టి.ధర్మేంద్ర గౌడ్‌ను నియమించి ఆయనకు నియామకపత్రం అందజేశారు. అనంతరం బీసీ సంఘం నాయకులు ధర్మేంద్ర గౌడ్‌ను శాలువాలతో సత్కరించారు.

రానున్న రోజుల్లో పోరాటానికి సిద్ధం..


కులగణన, జన గణన చేసి బీసీలకు న్యాయం చేయాలని.. లేని పక్షంలో రానున్న రోజుల్లో పోరాటాలకు సిద్ధమవుతామని జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమర క్రాంతికుమార్ హెచ్చరించారు. ఇప్పటికే కులగణనపై దేశవ్యాప్తంగా ఓబీసీలు ధర్నాలు, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించి వివిధ పార్టీల అధినేతలకు వినతిపత్రాలు అందజేశామన్నారు. ఈనెల 27న ఆదివారం విజయవాడలోని ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి తుమ్మలపల్లి కళాక్షేత్రం వరకు భారీ నిరసన ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 6వ తేదీన తిరుపతిలో బీసీల ఆత్మగౌరవ సభను నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగ మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాబాజీ, స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరి అశోక్, యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హనుమంతరావు, జిల్లా ఉపాధ్యక్షులు వరప్రసాద్, ఉద్యోగ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కేశన శంకరరావు

సీఆర్డీఏ అదనపు కమిషనర్ ఆకస్మిక పర్యటన

తాడికొండ: తాడికొండలో సోమవారం సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్ ఆకస్మిక పర్యటన చేశారు. స్థానికంగా రెవెన్యూ, మండల పరిషత్ ఇతర అధికారులకు ఎలాంటి సమాచారం లేకుండా ఓ బృందంతో కలిసి తాడికొండలోని పలు ప్రాంతాలను పర్యటించారు. పర్యటనకు వచ్చిన ఆయన తమ బృందానికి స్థానిక భూములను చూపిస్తూ వివరించారు. ఆకస్మిక పర్యటన కావడంతో మీడియా, ఇతర శాఖల అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. సమీపంలోకి రైతులను కూడా రానివ్వకపోవడంతో పూలింగ్ కోసమే తమ ప్రాంతంలో పర్యటించి వివరాలు తెలుసుకుంటున్నారనే ఊహాగానాలు రైతుల్లో లేవనెత్తాయి. తొలి విడత పూలింగ్‌కు ఇచ్చిన రైతులకే రిటర్నబుల్ ప్లాట్ల రిజిస్ట్రేషన్, ఆ ప్లాట్లలో ఇ–ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ చేయకుండా వదిలేశారని.. ఇప్పుడు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో మా భూములను ఎలా పూలింగ్‌కు ఇస్తామంటూ పలువురు రైతులు వాపోతున్నారు. అధికారిక ప్రకటన వస్తే కానీ రైతులు బహిరంగంగా స్పందించే అవకాశం లేదని అధికారంలో ఉన్న సొంత పార్టీ నేతలు చెబుతుండడం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రైల్వేలైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఇతర రహదారుల వరకే భూ సమీకరణ చేస్తారా.. లేక రెండో విడత భూ సమీకరణ ఉంటుందా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.



బృందంతో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత



తాడేపల్లి రూరల్: తాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసిన సందర్భంగా ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రాలు వచ్చాయి. ప్రశంసాపత్రాలను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం మాట్లాడుతూ 2024–25 విద్యా సంవత్సరానికి చెందిన 10వ తరగతి విద్యార్థులు 11 మంది దసరా సెలవుల్లో ఒకేషనల్ ఎడ్యుకేషన్, ఆటోమేటివ్ ట్రేడ్ లలో ఇంటర్న్‌షిప్ పూర్తిచేశారని అన్నారు. వృత్తి విద్య నైపుణ్య విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆటోమోటివ్ ఇన్‌స్ట్రక్టర్ అరవింద్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించాలి



మోతడక(తాడికొండ): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, ఆవిష్కరణలను గుర్తించి వారిని ప్రత్యేకంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా నాగ శ్రీనివాస రావు అన్నారు. కళాశాలలో సోమవారం సృజనాత్మకత, ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఏప్రియల్ 21 – 26 వరకు నిర్వహించిన ఈ పోటీలలో ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఛైర్మన్ ప్రొఫెసర్ టి.జి.సీతారామ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మానవ అభివృద్ధి వేగంగా జరుగుతున్న నేపథ్యంలో సృజనాత్మకతను జోడించి కొత్త ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలలో 22 టీమ్‌లు పాల్గొని తమ ఆలోచనలను చిత్రపటాల ద్వారా ప్రదర్శించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ వైవీ ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్ కుమార్‌లు అభినందించారు. ఐఐసీ కన్వీనర్ శాంతి పీరియా అకాడమిక్ డీన్ డాక్టర్ ఫణికుమార్ వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

ఎగుడు దిగుడు రోడ్డుపై ప్రయాణం.. ప్రమాదం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని పలు ప్రాంతాల్లో గుంటూరు–కర్నూలు రాష్ట్ర రహదారికి కొన్ని నెలల కిందట గుంతలు పూడ్చే క్రమంలో తారు రోడ్డుకు మరమ్మత్తులు నిర్వహించారు. ఈ క్రమంలో నిర్వహణ సరిగా చేయకపోవడంతో ఆయా ప్రాంతాల్లో వేసిన రోడ్డులో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఫిరంగిపురంలోని సెయింట్‌పాల్స్ హైస్కూల్ సమీపం నుంచి పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ పశువైద్యశాల వరకు.. అలానే గ్రామ శివారు నుంచి వేములూరిపాడు గ్రామ శివారు వరకు మరమ్మత్తులు చేసిన తారు రోడ్డు పూర్తిగా కలవకపోవడంతో ఎగు దిగుడుగా మారింది. దీంతో ద్విచక్ర వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. రోడ్డుపై వెళ్లే క్రమంలో ఆయా ప్రాంతాల్లో వాహనం కుదుపునకు గురై ప్రమాదాలు సంభవిస్తున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మరమ్మత్తులు నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న తారు రోడ్డు

ప్రతిభావంతులకు రివార్డులు



నగరంపాలెం: విధి నిర్వహణలో కృషి చేసిన వారికి గుర్తింపు ఉంటుందని జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణమూర్తి అన్నారు. ఇటీవల హోం మంత్రి అనిత జిల్లా పర్యటనకు విచ్చేసిన సందర్భంలో ప్రతిభ కనబరిచిన ఏఆర్ ఏఎస్ఐ నుంచి పొరుగు సేవల సిబ్బందికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ నగదు రివార్డులు ప్రకటించారు. వాటిని సోమవారం డీపీఓ ఆవరణలోని హాల్‌లో జిల్లా ఏఎస్పీ రమణమూర్తి అందించారు. రివార్డులు అందుకున్న వారిలో ఏఆర్ ఏఎస్ఐ షేక్.బుడే, ఏఆర్ హెచ్‌సీలు పి.మురళీబాబు, వై.శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు డి.గోపి, జి.శివశేఖర్, హోంగార్డులు రమణ, బి.సుధీర్‌బాబు, ప్రేమ్ కుమార్, షేక్.మీరాబి, పొరుగు సేవల ఉద్యోగులు సాయికృష్ణ, నాగరాజు, రాజయ్య, ఏసు మరియమ్మ, కామేశ్వరరావు, విజయ, సుజాత, కృష్ణవేణి, మస్తాన్‌బీ, మల్లీశ్వరి ఉన్నారు.

NOTICE

IN THE COURT OF THE CIVIL JUDGE (SENIOR DIVISION):: SATTENAPALLI
I.A.No.205/2024, I.A.No.206/2024 & I.A.No. 207/2024 in O.S.No.160/2017
Between :
Shaik Sajid ... Petitioner/Plaintiff
And
Shaik Bada Ghan Saida(Died) and Others. ...Respondents/ Defendants
To,
R-11: Shaik Habeen S/o. Late Bada Ghan Saida.
R-12: Shaik Susan, W/o. Shaik Jani Basha D/o. Late Bada Ghan Saida. Both are R/o. Dukkipadu Sivaru, Turakapalem(Vil), Medikondura(Md), Guntur Dist.
[illegible] ది.08-05-2025 [illegible] ఉ.గం.10-30ని.లకు [illegible] తేదీ : 08-05-2025
సానికొమ్ము సుబ్బారెడ్డి,
పిటిషనరు/వాది తరుపు అడ్వకేట్, గుంటూరు.

మే 1 నుంచి భారతీయ విద్యాభవన్‌లో వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు ఎడ్యుకేషన్: కలెక్టర్ బంగ్లారోడ్డులోని భారతీయ విద్యా భవన్ ఆధ్వర్యంలో మే ఒకటి నుంచి నెల రోజులపాటు వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సంస్థ కార్యదర్శి పి.రామచంద్రరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు చదువుతోపాటు వివిధ కళల్లో నైపుణ్యత అవసరమని, విద్యాసంవత్సరం పొడవునా నిరంతరం చదువు పేరుతో మానసిక ఒత్తిడికి గురైన విద్యార్థులకు లలిత కళలు, సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్యంతో పాటు వెస్ట్రన్ డాన్స్, చెస్, బాస్కెట్ బాల్ వంటి ఆటల పోటీలతో పాటు పెయింటింగ్, యోగా, వ్యాయామంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో శిక్షణ కల్పిస్తామని తెలిపారు. శిక్షణ శిబిరంలో ప్రముఖ సంగీత, నాట్య కళాకారులు, క్రీడా నిపుణులచే ఐదేళ్లు నిండిన బాల, బాలికలకు శిక్షణ తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు నేరుగా భారతీయ విద్యాభవన్ పాఠశాలతో పాటు 9124519444, 9908520110 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.